# హేమంత తుషారం – 3

''మా పెరట్లో ఉన్న చెట్టు జామ కాయ. చాలా తీపి. ఒక్కటి... ఒకే ఒక్కటి తినండి...'' అంటూ ప్లేటు చూపించాడు. అందులో నాలుగు ముక్కలున్నాయి.

మొహమాటానికి మళ్ళీ కూర్చోవాల్సి వచ్చిందతనికి.

ఒక్కటి అంటూ నొక్కి మరీ చెప్పారని లోలోపలే నవ్వుకుని ఒకటి తీసుకుని రుచి చూసిన హేమంత్ ''చాలా రుచిగా ఉందండీ...!'' అన్నాడు.

''బత్తాయిజామ గుండ్రంగా ఉంటుంది. దోరకాయ చూసి కోసి తెచ్చాను. అందుకే అంతతీపి...'' అని ''బాబూ... ఒక్క మాట... మీరెంతమంది అన్నదమ్ములు...?'' అంటూ ప్రశ్నించాడు.

''నేనొక్కడినేనండీ....!'' వెంటనే సమాధానం చెప్పాడతను.

తనవేపు చాలా ఆనందంగా చూసిన రామానుజంగారి వేపు కొంచెం వింతగా చూసాడు. ఇందులో అంత ఆనందించే విషయం ఏముందీ అని ఆశ్చర్యపోయాడు.

''మీ నాన్నగారు... ఏం... చేస్తుంటారూ...?''

''నాన్నగారు.. లేరండీ... రెండు సంవత్సరాలయింది ఆయన చనిపోయి...'' మెల్లగా అన్నాడు.

''అయ్యో... అలాగా...'' అన్నాగానీ రామానుజంగారి మోహంలో ఆ జవాబుకీ సంతోషం కనిపించటం చూసి హేమంత్ మరింత విస్తుపోయాడు.

''అయితే... అమ్మగారూ, మీరు ఇద్దరే ఉంటున్నారన్నమాట!''

రామానుజంగారి మాటకు అవునన్నట్లుగా అతను తలవూపి వూరుకున్నాడు. పెళ్ళి సంబంధంగా తను చెప్పిన వివరాలు ఆయనకి ఆనందం కలిగించాయనే విషయం అప్పటికి హేమంత్‌కి అర్థమైంది! 'ఔరా' అనుకున్నాడుమనసులోనే!

''మీ అమ్మగారు అదృష్టవంతులు! ఒక్కడే కొడుకు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఏ బాదరబందీ లేదు! ఆదాయంలో సగం పైగానే ఆదా! అంతేగా...?'' నవ్వుతూ చూశాడాయన హేమంత్ వేపు.

''అంతా ఆదా ఏం కాదు లెండి...''

''అదేమిటి...? బాధ్యతలేం లేనపుడు సంపాదనలో సగమైనా ఆదా అవుతుందిగా...?''

ఆయన అలా ఆరాలు తీయటం అతనికి కొంచెం చిరాకనిపించింది. ఈయనకు నిజాలే చెప్పాల్సిన అవసరం లేదనుకున్నాడు.

''బాధ్యతలు లేకపోవటమేమిటండీ! మా చిన్నాన్నల పిల్లలు నలుగురి బాధ్యతా నాదే. ఇద్దరు పిల్లల్ని బాగా చదివించాలి.... ఇద్దరు అమ్మాయిలకి పెళ్ళి చేయాల్సిన బాధ్యతా ఉంది!''

''అవునా...? నువ్వు మరీ బోళా శంకరుడిలా ఉన్నావ్! చిన్నవాడివని మీరు అనటం బావుండదనీ.... ఇలా అంటున్నానని మరోలా అనుకోకు సుమా! ఈ రోజుల్లో కొంచెం మెతకగా...మంచితనంగా

ఉంటే చాలు.. బంధువులు వాళ్ళ బరువును మన తలమీద పెట్టేసి వాళ్ళు తేలికపడిపోతారు! లేకపోతే... ఏమిటయ్యా ఇది...! స్వంత అక్కాచెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ పట్టించుకోని వాళ్ళని చూస్తున్నామా.... నువ్వేమో చిన్నాన్నల పిల్లల బరువు బాధ్యతా నీదనుకోవటం ఏమిటీ... తెలివితక్కువ కాకపోతే...!''

చనువుగా ఎంతో దగ్గరివాడిలా మాట్లాడిన ఆయనవైపు గౌరవంగా చూస్తున్నట్లు మోహం పెట్టి ''నేను నాన్నగారికి వాళ్ళందరూ జీవితంలో నిలదొక్కుకునేలా చూస్తానని మాట ఇచ్చాలెండి...!'' అన్నాడు.

దీంతో ఆయన తనని వదిలిపెట్టేస్తాడులే అనుకున్నాడు.

''బాబూ నాకు నీ పరిస్థితి పూర్తిగా అర్థమైంది! నీకా నోట్లో నాలిక లేదు... మీ అమ్మగారికేమో భర్తగారి అండదండా లేకపోయె...! అలాంటపుడు బంధువులంతా దగ్గరచేరి... మీకు ఆముదం రాయటంలో ఆశ్చర్యం ఏమీలేదు! నన్నొకసారి మీ వాళ్ళకు పరిచయం చేయి చాలు..! నీకు దన్నుగా నిలబడతా... వాళ్ళంతా వెన్ను చూపి పారిపోయేలా వాళ్ళపనిబడతా! నువ్వు మీ నాన్నకి మాట ఇచ్చిన సంగతి పూర్తిగా మర్చిపో... ఇదేమీ సత్యకాలం కాదు... నువ్వు సత్యవంతుడివీ కాదు! మీ నాన్నతోనే ఆయనకి ఇచ్చిన మాటా మాసిపోయినట్లే...! ఈ రోజులకి తగ్గట్టే మనమూ మారాలి.... తప్పదు...!''

ఆయన హితోపదేశానికి అతను నోటమాటరానివాడిలా దిగ్భ్రాంతితో చూసాడు.

ఒక క్షణం తర్వాత ఆయన చేతి వాచీని అటూ ఇటూ తిప్పి తిప్పి టైము చూసి ''ఇంతసేపు ఎపుడూ మార్కెట్లో ఉండేవారు కాదే... మీనాక్షమ్మగారు కామేశ్వరితో కలిసి ఇంకెక్కిడికైనా వెళ్ళారో... ఏమో...!'' తనలో తాను అనుకుంటున్నట్లుగా పైకే అన్నాడు. మొదట ఆయన చేతికి వాచీలేదు. ఇపుడు లోపలనుండి వచ్చేటపుడు చేతికి పెట్టుకుని వచ్చినట్లుగా హేమంత్ గమనించాడు. ఎందుకంటే... ఆయన అప్పటికి నాలుగైదుసార్లు పైగానే చేతివాచీని పదేపదే సవరించుకున్నాడు.

హేమంత్‌కి నవ్వొచ్చింది. చిరునవ్వుతో ''వాచీ కొత్తగా ఉంది. పెళ్ళిలో మీకు మావగారు ఇచ్చారా...?'' అనడిగాడు. ఆ ప్రశ్నలోని హాస్యం ఆయనకు అర్థమైందో, లేదో తెలియదు!

ఆయన మొహం ఇం...తయింది!

''భలే కనిపెట్టేసావయ్యా! ఏలోకాన ఉన్నాడోగానీ... మా మావగారు దొడ్డమనిషి. నేను అడగకుండానే అలకపాన్పుమీద రిస్టు వాచీ, మొదటి పండక్కి రేడియో ఇచ్చారు. ఆయన అంటే...మా మామగారి గుర్తుగా అపుడపుడు పెట్టుకుంటానేమో... కొత్త వన్నె తగ్గలేదు. ఇప్పటికీ శుభ్రంగా తిరుగుతూనే ఉంది! రేడియో మాత్రం అపుడపుడూ మొరాయిస్తుంటుంది. రిపేరు చేయించమని పెద్దపిల్ల గొడవ చేస్తోందికానీ నేనే పట్టించుకోవటం లేదు. ఎప్పుడూ రేడియో మోగుతూనే ఉండాలి దానికి. నీ పెళ్ళిలో అల్లుడికి వాచీ ఉంగరంతో పాటు రేడియో కూడా ఇస్తాన్లే అని చెప్పేసా...! వెనక ఇద్దరు ఆడపిల్లలున్నాగానీ... తప్పదు మరి... అల్లుడన్నాక ఆ మాత్రం గౌరవం చూపించాల్సిందే! ఏమంటారు..? ఒక మగ నలుసుండి ఉంటే... ఇంకా భారీగా లాంఛనాలు జరుపగలిగేవాడిని! ఇపుడేముందీ... ముగ్గురు ఆడ సంతానాన్ని కని మా ఆవిడ నా మొహాన పడేసింది... నా సంపాదనలో సగం పైగా వాళ్ళ తలనూనెలు, కుంకుడుకాయలకే క్షవరం అయిపోతోంది...!'' అంటూ నిట్టూర్చాడు.

హేమంత్‌కి నవ్వొచ్చింది. చిన్నగా నవ్వి ''మగనలుసులకయితే... మీరే చెప్పారుగా... ఇంకోలా సెలూన్ ఖర్చు ఉండేదికదండీ! పిల్లలు ఆడ, మగ ఎవరైనా ఖర్చు... ఒకటే... తప్పదు లెండి!'' అన్నాడు.

''భలే చెబుతున్నావయ్యా... ఒకటే ఎందుకవుతుందీ...? ఆడపిల్లలకి కట్నాలిచ్చి పెళ్ళిళ్ళూ... ఆపైన పురుళ్ళూ పుణ్యాలూ... అంటూ అబ్బో... ఎంత ఖర్చు...!'' అంటూ మళ్ళీ నిట్టూర్చాడు.

ఈయన ఆ పిల్లల ముందూ ఇలానే కట్నాలూ పెళ్ళిళ్ళూ అంటూ గుండెలు బాదుకున్నట్లు మాటలాడుతూంటాడా...? పాపం... వాళ్ళ మనసులెంత నలిగిపోతుంటాయో...!

హేమంత్ కూడా నిట్టూర్చాడు.

''మీరు పొరపాటు చేసారు. పెళ్ళి కుదిరేంతవరకైనా చదువు ఆపెయ్యకుండా మీ అమ్మాయిని చదివిస్తూ ఉండాల్సింది! ఇప్పుడైనా మించిపోయింది లేదు. ప్రైవేటుగా మెట్రిక్ పరీక్షకు కట్టించండి. నాకు తెలిసిన... మా ఫ్రెండుకు ట్యూటోరియల్ ఉంది. అక్కడ బాగా చదివిస్తారు. మీరు పంపిస్తానంటే అడ్రసు ఇస్తాను ఇక్కడకి దగ్గిరే...''

హేమంత్ మాటలకు అతను నవ్వు మొహంతో ''నువ్వు చెప్పాక కాదంటానా... తప్పకుండా అలాగే చేద్దాం! ఒకసారి మీ అమ్మగార్ని ఇక్కడకు తీసుకువస్తే... బావుంటుందనీ...'' మెల్లగా నసిగాడు.

హేమంత్ లేచి నిలబడి ''తప్పకుండా... అలాగే...'' అంటూ బయటకు వస్తోంటే ఆయన కూడా రెండడుగులు వేసి ''మీనాక్షమ్మగారికి వచ్చి వెళ్ళారని చెబుతా. ఇంకా ఏమైనా చెప్పాలా... ఆవిడతో పనేమైనా ఉందా...?'' అనడిగాడు.

''అదేం అవసరం లేదండి. ప్రత్యేకమైన పనంటూ ఏం లేదు. నాకు క్లాసు తీసుకోవాల్సిన రెండు గంటలు ఖాళీ వచ్చింది. సరే, మీనాక్షమ్మగారిని పలుకరిద్దామని ఇటు వచ్చా. మొన్న ఆవిడది ఒక కథ చదివా.. దాని గురించి నా అభిప్రాయం చెబుదామనీ...''

''ఏంటీ... ఆ పెద్దావిడ కథలు గట్రా రాయటం అంతా నిజమే ననుకుంటున్నావా....?''

''ఏం కాదంటారా....? మహాలక్ష్మిగారే రాస్తూండివుంటారని మీ అభిప్రాయమా...?''

వాళ్ళిద్దరూ కాదని నా నమ్మకం. వెనక ఎవరో గట్టిపిండం... వాళ్ళకి కావల్సినాయన రాసి ఆడపేరు పెడుతున్నాడని అనుకుంటున్నా! లేకపోతే... ఆశమ్మ పోచమ్మల కబుర్లు తప్ప ఆడవాళ్ళు రాసేదేం ఉంటుందో నువ్వు ఆలోచించు.''

''అదేమిటలా అంటున్నారు...? తమ ఆలోచనల్ని కాగితం మీద పెట్టగలిగే ప్రతిభ ఉన్నవాళ్ళు ఎవరైనా రాయగలుగుతారు! ఆడవాళ్ళు రాయలేరని ఎలా అనగలుగుతున్నారో నాకర్థం కావటం లేదు! వాళ్ళు అన్నిరకాల చదువులు చదువుతున్నారు... ఉద్యోగాలూ చేస్తున్నారు కదండీ...!''

''నిజమేగానీ... ఏమో... నాకు మాత్రం నమ్మకం కుదరటం లేదు! ఆ మధ్య పోస్ట్‌మాన్ ఇన్ని

ఉత్తరాలు తెచ్చి ఇస్తుంటే... అతన్నే అడిగాను 'ఏమిటీ ఆ పోస్టంతా వాళ్ళకేనా' అని! రచయిత్రిగారికే నండీ అంటూ ఏదో తమాషా పేరు చెప్పాడు... ఏమిటబ్బా అది...?''

ఆయన ఆలోచిస్తోంటే... హేమంత్ 'తుషార...' అంటూ అందించాడు.

''ఆ... అదే... ఆ పేరును గుర్తుపెట్టుకోవాలంటే... తుస్సు... బుస్సు బూర అనుకుంటే సరిగ్గా గుర్తుకు వస్తుందేమో...'' అంటూ ఆయన పెద్దగా నవ్వాడు.

''సరే... నేనిక వస్తానండీ....'' అంటూ హేమంత్ పెద్ద పెద్ద అంగలతో బయటకు నడిచాడు.

★ ★ ★

సాయంకాలం ఇంటికి వచ్చిన మహాలక్ష్మితో మీనాక్షమ్మ ''నీకో ఉత్తరం వచ్చిందే... ముందుగదిలో బల్లమీద పెట్టాను... చూడు...'' అని చెప్పింది.

కాళ్ళూచేతులూ కడుక్కుని వచ్చి తీరుబడిగా కూర్చుని మహాలక్ష్మి ఉత్తరం చేతిలోకి తీసుకుంది.

మీనాక్షమ్మ టిఫిన్ ప్లేటు మనవరాలి ముందు పెట్టి బయటకు వెళ్ళింది. కారప్పూస కొంచెం నోట్లో వేసుకుని నములుతూ ఉత్తరం చదవటం మొదలు పెట్టింది.

తుషార గారి మనవరాలు మహాలక్ష్మి గారికి.

మొన్న మొన్నటి వరకూ తుషార గారి పేరు మీదే ఉత్తరాలు రాసేవాడిని.. ఇప్పుడు మీపేర ఎందుకు రాస్తున్నానా అని మీకు సందేహం వచ్చే వుంటుంది! పరిచయం కలిగింది కాబట్టి కథల గురించి నా అభిప్రాయాలు ఇంటికే వచ్చి బామ్మగారితో మాట్లాడొచ్చు. మీతో ఒక విషయం చెబుదామని ఈ ఉత్తరం రాస్తున్నా. అది ఆఖరున చెబుతా.

ఈ మధ్య పత్రికలో వచ్చిన కథలో ఒక వాక్యం ఉంది. రాసింది మీరే కాబట్టి మీకూ గుర్తుండే

ఉంటుంది. అంటే... నా ఉద్దేశం... తుషారగారి కథలన్నీ మీరే రాసి పెడుతూంటారుగా! ఇంతకీ అదేమిటంటారా... 'పన్నీటిచిలకరింపులా ఆత్మీయుల పలకరింపు ఎంత పరవశం కలిగిస్తుందో!' మొన్నీమధ్య మీ ఇంటికి వచ్చినపుడు... పన్నీటిజల్లులో తడిసిన అనుభూతి నన్ను మురిపించింది! మీ ఆత్మీయుల జాబితాలో నేనుండక పోవచ్చునుగానీ... నాకు మాత్రం మీరు ఎప్పటినుండో నాకు తెలిసిన ఆత్మీయులన్నట్లుగా భావన కలిగింది! కారణం ఏమిటో నాకే సరిగ్గా తెలియటం లేదు! ఆత్మీయుల పలకరింపు మాత్రమే కాదు, మనం ఆత్మీయులుగా భావించే వాళ్ళను పలకరించినా అదే పరవశం... అలాంటి అనుభూతే కలుగుతుందనేది నా స్వీయానుభవం! ఉత్తరం రాద్దామనే ఆలోచనతోనే ఆ విషయం నాకు తెలిసివచ్చిందిమరి!

మీ ఇంటికి వచ్చినపుడు మీ మాటల ద్వారా నేను మరోసారి రావటం మీకు నచ్చదనే విషయం నాకు తోచింది. అందుకే... మీరు లేని సమయాన్ని ఊహించి ... బామ్మగారితో మాట్లాడదామనుకున్నా కానీ వీలు కాలేదు. మరోసారి ప్రయత్నిస్తా.

ఇంతకీ మీకు చెప్పాలనుకున్నదేమిటంటే... మీ ఇంటి దగ్గర కాకుండా... మిమ్మల్ని నేను తొందరలోనే కలుసుకునే అవకాశం కలిగినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది! అది ఎప్పుడు... ఎక్కడ... ఎలా అన్నది ఇపుడే నేను చెప్పను. తొందరలోనే మీకూ తెలుస్తుంది కదా!

కొంచెం ఎక్కువ చనువుగా మాట్లాడానని అనిపిస్తే మన్నించండి. ఇక సెలవ్!

ఇట్లు

మీ (నాన్నమ్మగారి ) అభిమాని

హేమంత్.

చదవటం పూర్తి చేసిన మహాలక్ష్మి ఆశ్చర్యంతో అలా కూర్చుండి పోయింది.

మళ్ళీ ఒకసారి నిదానంగా చదివింది. కారణం ఏమిటో అర్థం కాలేదుగానీ అతను అలా ఉత్తరం రాయటంతో.... కోపం ఏమీ రాలేదు... ఇష్టంగానే అనిపించింది!

అయితే ఎక్కడ తనని కలుస్తాడు...? ఎందుకో...!

ఆ వివరాలు చెబితే బావుండేది.. తనకీ ఆత్రుత, ఆలోచన తగ్గేవి కదా అనుకుంది.

అంతలోనే మీనాక్షమ్మ ''ఇది విన్నావుటే....'' అంటూ వచ్చి మహాలక్ష్మి ఎదురు కుర్చీలో కూర్చుంది.

''నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుందీ... చెప్పూ...'' అంది మహాలక్ష్మి.

ఆవిడ లేచి వెళ్ళి తలుపులు వేసి వచ్చి కూర్చుని మొదలు పెట్టింది.

''నేను కామేశ్వరిని తీసుకుని కూరగాయల కోసం వెళ్ళినపుడు... మనింటికని ఆ అబ్బాయ్... హేమంతు వస్తే... రామానుజం తనింట్లో కూర్చోపెట్టాడుట. అందులో ఏం విడ్డూరం లేదుగానీ.... ఆ కాసేపటిలోనే పెద్ద కూతురు కనకాన్ని చూపించి పెళ్ళి కూడా నిశ్చయం చేసుకున్నాడట! ఇపుడు... కామేశ్వరికి లడ్డూలు చేయటంలో సాయానికి వెళ్ళానా.... తనే ఆ వివరాలు చెప్పుకొచ్చింది...''

మహాలక్ష్మి ఆశ్చర్యంగా ''ఏమిటీ పెళ్ళా...?! అంత తొందరగానా...?'' అంది.

''అదేకదా నే చెబుతున్నది... నాకూ విచిత్రంగానే అనిపించింది! రామానుజం వాళ్ళ వాటాకి ఆనుకునే ఉంటారుగా... భాస్కరాంబ ఒక చెవి అటువేసే ఉంచుతుందెపుడూ. ఆవిడ ఆ రోజే ఈ కబురు కామేశ్వరికి చెప్పిందటలే. ఆ కనకం ఎపుడైనా తప్పిదారి వంటచేస్తే ఉప్పు వేస్తే కారం వేయదూ... పిల్లకి పరధ్యానం ఎక్కువ... ధ్యాస ఎప్పుడూ రేడియోమీదే ఉంటుందని... రామానుజం, భార్య రుక్కమ్మ మీద విసుక్కుంటూ ఉంటాడా..నవ్వొచ్చే సంగతి ఏమిటంటే... ఆయన ఆ అబ్బాయికి కనకం వంట బ్రహ్మాండంగా చేస్తుందని చెప్పాడట! ఆ మాట భాస్కరాంబ విందిగా, కామేశ్వరికి చెబుతూ ఎంతగా నవ్విందోనట!''.

''అది సరేలే... వంట ఇపుడు రాకపోతే మాత్రం నష్టం ఏముందిలే... అవసరాన్ని బట్టి నేర్చుకుంటుంది! అదేమంత కష్టం కాదు! అయితే నాకు ఆశ్చర్యం ఏమిటంటే... అనుకోకుండా వచ్చి... అమ్మాయిని చూసి పెళ్ళి నిశ్చయం చేసుకోవటం ఏమిటా అని!''

''ఏమిటో మరి! నాకు చెప్పలేదుగానీ... రుక్కమ్మ భాస్కరాంబకీ, కామేశ్వరీ వాళ్ళకి పిల్లకి పెళ్ళి కుదిరిందంటూ మొన్ననే చెప్పిందట! కనకాన్ని చూసి ఆ అబ్బాయి చూపు తిప్పుకోలేకపోతేనూ... అతని ఇష్టాన్ని గమనించి... రామానుజం పెళ్ళిలో ఇవ్వబోయే లాంఛనాలనీ చెప్పేసి... పెద్దవాళ్ళని తీసుకువస్తే మాట్లాడుకుందామని అన్నాడట! ఆ అబ్బాయికయినా అంత తొందర ఎందుకో...! పిల్లలకి ఇష్టమైనపుడు కులం గోత్రం... అంటూ పెద్దవాళ్ళం అభ్యంతరం చెప్పటమెందుకూ అని పెద్ద మనసుతో మావారు ఖాయం

చేసేసారూ' అని రుక్కమ్మ చెప్పుకుంటోంటే... భాస్కరాంబ మాత్రం 'రామానుజం తెలివైనవాడు.. లౌక్యంగా మాట్లాడి... పిల్లకు వడ్డాణం పెట్టి చూపించి... ముందుగానే లాంఛనాల ఆశతో అతగాడిని పడగొట్టేశాడూ అంటూ నవ్విందట!''

''సరే... అవన్నీ మనకెందుకుగానీ మొత్తానికి కనకానికి హేమంత్‌తో పెళ్ళి మాటలు జరిగాయన్నది మాత్రం నిజం! అంతేగా! మంచిదే..!'' నిర్లిప్తంగా అంది మహాలక్ష్మి.

''ఆఁ... మంచిదే... నేనేం కాదనటం లేదు! కాకపోతే... ఆ రోజు మనింటికి వచ్చినపుడు దగ్గిర బంధువులా అంత ఆప్యాయంగా మాట్లాడినవాడు... ఇదీ విషయమని మనకోమాట చెప్పొద్దూ...! ఆ రామానుజం కూడా అంతే! కామేశ్వరి ఇంటినుండి వస్తోంటే.... కనిపిస్తే ఆయన్నే ఈ మాట అడిగా. 'ఏమయ్యా... పెద్దమ్మాయికి పెళ్ళి కుదిరితే, అందరికీ చెప్పావుగానీ... మా చెవిని వెయ్యలేదేం?' అని.

'అయ్యో... మీ మనవడు కదా, మీకే ముందుగా చెప్పివుంటాడని అనుకున్నానండీ' అన్నాడు. పైగా పెద్ద వింత ఏమిటంటే... అతని పేరు కూడా రామానుజానికి తెలియదు. అయినా పెళ్ళి మాత్రం నిశ్చయం చేసేసుకున్నాడు! వాళ్ళమ్మగారిని తీసుకువస్తానన్నాడని ఎదురుచూస్తున్నాడట! 'ముందు చెప్పకుండా హఠాత్తుగా వచ్చేస్తే ఎలా చెప్పండీ... మర్యాదలూ అవీ ఉంటాయిగా, ఏర్పాట్లు చూసుకోవద్దూ' అనడుగుతున్నాడు! అందుకని ఓ కార్డు రాసి పడేస్తానూ. పేరు, అడ్రసూ చెప్పండని అడిగాడు!'' అంది నిట్టూరుస్తూ.

''నువ్వేం చెప్పావ్?''

''అతన్ని మేమూ ఆరోజు మొదటిసారి చూశాం. వివరాలు మాకూ తెలియదు. వరస చెప్పబోతోంటే... మీరే 'ఏదయితేనేం లెండి' అనేసరికి ఆపేసాను. ఆ వరసలో నేను చెప్పిన మరిదికో, మరెవ్వరికో స్నేహితుడి కొడుకని చెప్పబోయానంతే! 'పెళ్ళి కుదుర్చుకోవటానికి కులం, గోత్రం, కుటుంబవివరాలు వగైరాలు కావాలంటే మీరే వాకబుచేసి కనుక్కోండి. మా బంధువని మాత్రం ముందంజ వేసి మామీద నెపం మాత్రం పెట్టకండీ... పేరు, అడ్రసు కావాలంటే... అతనెపుడో కథల గురించి ఉత్తరం రాసాడు కాబట్టి అమ్మాయినడిగి చూసి రేపు చెబుతాలెండి! అని చెప్పానే...!'' అందావిడ.

''అవును... అలా చెప్పటం మంచిదే!''

''కులం గోత్రం లాంటి విషయాల్లో అతనికి పట్టింపులున్నా, పిల్లలి ఇష్టాల్నీ ఈ రోజుల్ని బట్టి మన్నించాల్సిందేనని ఓ మెట్టు దిగవచ్చాడట! చూపులకి అబ్బాయి అందంగా ఉన్నాడు, మంచి

ఉద్యోగం.... అని ఆశపడటంలో తప్పులేదు. కానీ ఆ విషయం మనకి తెలియకూడదన్నట్లు పిల్లలకోసం తనే తగ్గానని గొప్పలు చెప్పుకోవటం ఎందుకూ...! వయసుని బట్టి మాటవరసకు మనవడని అన్నానేగానీ, అతనితో మనకేం సంబంధ బాంధవ్యాలు లేవనీ చెప్పేసా. కాబట్టి మనకేం బరువు బాధ్యతలు లేవు! ఎవరెలా పోతే మనకేమిటిలే...!'' అంటూ నిట్టూర్చింది..

''వాళ్ళ పెళ్ళి కుదుర్చుకుంటే... నీ కెందుకో కష్టంగా ఉన్నట్లుందేమిటీ...?''

''కష్టం కాదుగానీ... అతని ప్రవర్తన నాకేం నచ్చలేదు! పరిచయం ఉండి, ప్రేమ కలిగి... పెళ్ళి నిర్ణయం

తీసుకుంటే, అనుకోవటానికేమీ లేదు. కానీ... అతను... చూసిన మొదటిరోజే... ఊళ్ళోనే

ఉన్న కుటుంబసభ్యుల ప్రమేయం లేకుండా అంత తొందరగా అలాంటి నిర్ణయం... సరేలే... అదంతా మనకెందుకుగానీ... కులం సంగతి పట్టించుకోకపోవటంలో తప్పు చేసానంటారా... మీ అభిప్రాయం చెప్పండీ' అని ఆఖరున మళ్ళీ అడిగేడు రామానుజం. 'నా మట్టుకు నాకు.... మిగతా విషయాల సంగతి తెలియదుగానీ... కులం గురించి పట్టింపు పెట్టుకోకపోవటం మాత్రం మంచి నిర్ణయమే...' అని చెప్పి చక్కా వచ్చేశాను!''

''మంచిదే కానీ.... నువ్వెందుకో మొహం అలా గంటు పెట్టుకున్నట్లు కనుపిస్తున్నావ్? ముందుగా నీకు చెప్పనందుకేనా....?''

''ఏమిటోనే...'' అంటూ ఆవిడ నిట్టూర్చింది.'' నేను అతన్ని చూసినపుడు ఏమిటేమిటో ఊహించేసా... ఇపుడవన్నీ అనవసరంలే..'' అని ''ఉత్తరం ఎవరి దగ్గర్నుండీ? నీ స్నేహితులా...'' అంటూ జవాబు కోసం ఎదురుచూడకుండానే ఆవిడ లోపలకు వెళ్ళిపోయింది.

అప్పుడు... ఆఉత్తరం గురించి మహాలక్ష్మి మనసులో ఓ ఆలోచన మెరిసింది!

అంటే... అతను చెప్పిన విషయం ఇదన్నమాట! ఇంటిదగ్గర కాకుండా కలుసుకోవటం అని రాయటంలోని ఉద్దేశ్యం... తన పెళ్ళిలో అని కాబోలు! ఆ మాట చెప్పటానికి ఆత్మీయత వగైరా లాంటి మాటల అవసరం ఏముందీ... ఏమిటో...! అనుకుంటూ నిట్టూర్చింది.

★ ★ ★

ఇంటిముందున్న స్థలంలో... రామానుజం చిన్న కూతుళ్ళిద్దరూ చేతులు పట్టుకుని 'ఒప్పుల కుప్పా వయ్యారిభామా' అంటూ గిర్రున తిరుగుతూంటే, పెద్ద కూతురు కనకం మెట్లమీద కూర్చుని నవ్వు మొహంతో పరికించి చూస్తోంది! అలా రివ్వున తిరగాలనే సరదా కనకానికీ ఉంటుందిగానీ... 'పెళ్ళీడుకొచ్చిన పిల్లవి' అనే పెద్దవాళ్ళ మాటలు కనుపించని సంకెళ్ళలా అడ్డంపడి కూర్చోబెడుతూంటాయి!

పక్కవాటా మెట్లమీద కూర్చున్న పెద్దావిడ భాస్కరాంబ ''ఏమిట్రా పిల్లలూ... అంత నిదానంగా, వయ్యారంగానా తిరగటం...? ఊపుకి జడలు ఇంతెత్తున నిలబడేలా రయ్‌మని తిరగాలిగానీ...'' అంటూ నవ్వింది.

కామేశ్వరీ వాళ్ళ ఇంటి మెట్లమీద కూర్చుని చిక్కుడుకాయలో ఏవో ఈనెలు తీస్తూనే ఒక చూపు పిల్లల వేపూ ఉంచింది.

మీనాక్షమ్మ కూడా అపుడే బయటకు వచ్చి గుమ్మం దగ్గిర నిలబడిరది.

ఆ సమయంలో... కాంపౌండ్ గేటు గడియ తీసిన సడికి పిల్లలిద్దరూ ఆట ఆపి అటు చూశారు. ఎవరో కొత్తావిడ ఎవరింటికో అనుకుంటున్నట్లుగా వాళ్ళు చూస్తుంటే, ఆవిడ వెనక నిలబడిన హేమంత్‌ని గమనించిన కనకం చటుక్కున లేచి లోపలకు పరుగెత్తింది. రామానుజంతో ''వాళ్ళు వచ్చారు నాన్నా...'' అని చెప్పింది.

కొంచెంగా తలవాల్చుకున్న కూతుర్ని వింతగా చూసి ''వాళ్ళు అంటే... ఎలా తెలుస్తుందే పిచ్చితల్లీ...''

అంటూ బయటకు వచ్చాడు.

''మొన్న మనింటికి వచ్చి, కాఫీ తాగి వెళ్లినాయన....'' అని అంటూండగానే ఆయన ''మొన్న ఏమిటే... అపుడే వారం పదిరోజులు కావటం లేదూ...'' అన్నాడు.

''అబ్బ... ఎన్ని రోజులయితే ఏమిటినాన్నా... వాళ్ళ అమ్మగారిని కాబోలు, అతను వెంట బెట్టుకుని వచ్చారు...'' అంది ఎఱ్రబడ్డ మొహంతో.

అప్పటికి అర్థమైంది రామానుజానికి. హడావుడిగా బయటకు వచ్చేసరికి... ఆవిడ గేటు లోపలికి వచ్చి రెండడుగులు వేసి సంశయంగా ఆగి నిలబడిరది.

హేమంత్ కనుపించలేదు. అయినా అతను ఆలోచనగా చూస్తూనే ఎదురు వెళ్ళి ''రండి... రండి...'' అంటూ లోపలకు తీసుకువచ్చాడు.

అతని వెనకనే వచ్చిన ఆవిడ అటూ ఇటూ పరికించి చూస్తూ ''బావుందండీ... ఇలాంటి వేళప్పుడు మెట్లమీద కూర్చుని చక్కగా కబుర్లు చెప్పుకుంటారన్నమాట ఈ ఆవరణలో ఉంటున్న ఆడవాళ్ళంతా...!'' అంది.

''అవునండీ...'' అంటూ నవ్విన రామానుజం వివరంగా చెప్పుకొచ్చాడు. ''మగవాళ్ళు వరండాల లోనూ, ఆడవాళ్ళు మెట్లమీదా కూర్చోవటం అలవాటు. మేం ఏ పేపరో, పుస్తకమో చేతబట్టుకుని కూర్చుంటాంగానీ... ఆడవాళ్ళు ఏం చేస్తారండీ పాపం... పనులన్నీ చక్కబెట్టేసుకుని కబుర్లు... అవేనండీ ఆశమ్మ, పోశమ్మల పోచికోలు సంగతులన్నీ వీళ్ళ బాధలే అన్నట్లుగా ఏకరువు పెట్టుకోవటం... ఒక్కోసారి కళ్ళు కూడా తడిపేసుకుంటారండీ బాబూ...! ఇంకోసారి ఏం చెప్పుకుంటారో తెలీదుగాని పగలబడి నవ్వేసుకుంటూంటారు కూడా...!'' అని తనూ నవ్వాడు.

ఆవిడా నవ్వుమొహంతో వింది. ''చక్కగా ఎవరి గుమ్మం ముందు వాళ్ళు కూర్చుని సరదాగా అందరూ కబుర్లు చెప్పుకోవటం... బావుందండీ!''

రామానుజం కూడా తలవూపుతూ ''అవునండీ... ఇల్లుకూడా పకడ్బందీగా బాగా కట్టినట్లే! వెనక పెరటి వేపు కూడా, ముందు వరండాలకి వున్నట్లే అడ్డుగోడలూ ఉన్నాయి. మనుష్యులమే ఒకరి కొకరం కనుపించంగానీ... మాటలు, పోట్లాటలు అన్నీ చక్కగా వినబడతాయి..'' అంటూ నవ్వాడు.. ''ఎటొచ్చీ మధ్య వాటాల వాళ్ళకి ముందు వెనక నుండి తప్ప గాలి వచ్చే దారి లేదు. చివర వాటాల వాళ్ళకి ఒక గది ఎక్కువే ఉంది.... గాలీ బాగా వస్తుంది! ఏమైనా మా లాంటి వాళ్ళకి భారం కాకుండా అద్దెలూ కొంచెం తక్కువవటంతో చేరిన వాళ్ళెవరూ ఖాళీ చేయటం లేదు!

అలా ఏవో కబుర్లు కల్పించుకుని చెప్పుకుపోతున్నా... అతని మనసులో ఒక సందేహం ఉండనే ఉంది. కూతురు ఎవర్ని చూసి 'అతను' అనుకుందో... అతను వచ్చివుంటే, కనుపించడేం...?

సందేహనివృత్తిగా ''బాబు... హనుమంతు రాలేదా...?'' అనడిగాడు.

లోపలనుండి ''నాన్నా... పేరు హేమంతు... హనుమంతు కాదు...' అంటూ కీచుగా అరిచింది. రామానుజం ఉలిక్కిపడి ''పెద్దవాడిని గదా... కొంచెం మతిమరుపు వచ్చేసిందిలెండి...'' అంటూ నవ్వాడు.

''నువ్వలా పేరు చెప్పొచ్చటే...'' రుక్కమ్మ మెల్లగా కనకాన్ని కసరటమూ ముందు గదిలో ఉన్నవాళ్ళకి వినిపించింది కూడా.

''అబ్బాయి... నన్నిక్కడ వదిలిపెట్టి పని వుందని కాలేజికి వెళ్ళిపోయాడు. కాసేపట్లో వస్తానన్నాడుగాని నేనే అవసరం లేదు... రిక్షామాట్లాడుకుని వచ్చేస్తానని చెప్పాను. అలవాటైన ఊరేగా, ఇబ్బంది ఏం ఉంటుందీ...'' అంది.

సందేహం తీరిపోవటంతో రామానుజం తేలికపడ్డాడు. హడావుడి పడుతూ ''ఇక్కడ కూర్చోండి'' అంటూ బాగావున్న పెద్ద కుర్చీని భుజంమీదున్న తువ్వాలుతో దులిపి... ఆవిడకు చూపించాడు.

ఆవిడా సందేహంగా అటూ ఇటూ చూస్తూనే ''ఇంతకీ...'' అంటూ ఏదో అడగబోయి ఆగిపోయింది. రామానుజం ''చిన్నారీ'' అంటూ అరిచి లోపలనుండి వచ్చిన చిన్న కూతురికి ''కామేశ్వరి అక్కని రమ్మన్నానని పిలుచుకు రా... పో...'' అని పురమాయించాడు.

చేతిలోని పనిని పక్కన పెట్టేసి పిలుపు రావటమే తరువాయిగా బాణంలా దూసుకు వచ్చినట్లుగా కామేశ్వరి వచ్చేసింది.

రామానుజం నసుగుతూ ''మీరు ఒక్కరే వచ్చారు.... నాకేం చాదస్తాలు లేవుగానీ... ఎందుకైనా మంచిదని... ముతైదువ మీకు తోడుగా పక్కన కూర్చుంటే... మాట్లాడుకోవటం బావుంటుందనీ... అంతేనండీ..!'' అన్నాడు.

''దేని గురించి... మీరు... ఏం చెబుతున్నారూ...?'' ఆవిడ ఆశ్చర్యపోతూ అడిగింది.

''అదేనండీ... మన పెద్దలు శుభకార్యాలకి గానీ... సంబంధించిన మాటలకు గానీ ముతైదువులు ముందుండాలని అంటారు కదా, అందుకనీ... అంతే! ఏదైనా పెద్దలేర్పరిచిన దారిలో అనుసరించి పోవటమే గానీ... నేను కొత్తగా, స్వంతంగా ఏమీ చేయనండీ బాబూ...!'' అని మళ్ళీ వెంటనే మాటలు పొడిగించాడు.

''బాబు ఇలా చెప్పా పెట్టాకుండా తీసుకువస్తాడేమోననే అనుమానంతోనే ఓ కార్డు ముక్క రాసి పడేసా... ఎపుడు మిమ్మల్ని తీసుకువచ్చేదీ తెలియజేయమని అడుగుతూ. ఉత్తరం అందిందా...?''

ఆవిడ ఇంకా అయోమయంగా చూసి ''ఉత్తరం... ఏమి రాలేదండీ! అయినా... మీరు... నన్ను ఎందుకూ...?'' అంది.

ఎవరింటికైనా పొరపాటున రాలేదుగదా అనే అనుమానమూ ఆవిడకు వచ్చింది. 'నువ్వు కూడా రారా...' అని తను అంటే... కాలేజిలో అర్జంటు పని ఉంది. వెళ్ళాలి నీకేం ఫరవాలేదు... ఆవిడ చక్కగా చాలా కలుపుగోలుగా మాట్లాడతారు... ఇదే ఇల్లు...' అని చెప్పి వెళ్లాడు... ఇక్కడ ఏమిటో... ఏదీ అర్థం కానట్టు అయోమయంగా ఉందే!''

ఆవిడలా ఆలోచనలో ఉండగానే రామానుజం మాటలు కలిపాడు.

''అయితే మీకు ఉత్తరం చేరనే లేదా... ఎందుకో ఆలశ్యం అయిందనుకుంటానండీ అక్కడికీ మీనాక్షమ్మగారిని అడిగి తీసుకున్న అడ్రసు కాగితం దగ్గర పెట్టుకునే రాసాను. తప్పు కావటానికి వీల్లేదు!

వాళ్ళు సరైనది ఇచ్చివుండకపోతే ఏమోగానీ! సరేలెండి... ఏమయితేనేం, అబ్బాయి చెప్పినట్లుగానే మిమ్మల్ని తీసుకువచ్చాడు! అదే సంతోషం!'' అన్నాడు మొహం ఆనందంగా పెట్టి.

''అబ్బాయి నాకు ఏమి చెప్పలేదు.. అందుకే ... నాకూ... ఏమీ అర్థం కావటం లేదు... ''కొంచెం నసుగుతూనే అందామె.

''అదేమిటండీ... మీకేమీ చెప్పనే లేదా... ఎందుకని అయివుంటుందీ...'' రామానుజం చూపుడు వేలును పెదవులపై ఆనిస్తూ... ఆలోచనలో పడ్డాడు.

ఆవిడ రామానుజాన్ని ''ఇంతకీ మీనాక్షమ్మగారు ఎవరూ...? మావాడి అడ్రసు ఆవిడ దగ్గర ఎందుకు ఉన్నట్టూ...?'' అనడిగింది.

''సరిపోయింది లెండి...'' అంటూ రామానుజం పెద్దగా నిట్టూర్చాడు. ''మీ అబ్బాయి మీకేమీ చెప్పకుండానే వెంటబెట్టుకు వచ్చాడన్నమాట! మీరంటే కొంచెం భయభక్తులు ఎక్కువే కాబోలు... లేక మొహమాట పడ్డాడా... తనే పెళ్ళి విషయం చెప్పటానికి. ఇక్కడికి వచ్చాక ఎలాగూ తెలుస్తుంది కదా అనుకున్నట్లున్నాడు! మొత్తానికి అబ్బాయికి కొంచెం చమత్కారం ఎక్కువే అనిపిస్తోంది...!'' అంటూ ఫక్కున నవ్వేసి ''అదేమిటండీ... మీకు మీనాక్షమ్మగారి గురించీ చెప్పలేదా....? వాళ్ళింటికి వస్తేనేగదూ, నేను అతనిని మొదటిసారి చూశానూ...'' అన్నాడు.

అప్పుడు ఆశ్చర్యంగా చూస్తున్న కామేశ్వరి కొంచెం తేరుకుని ఆవిడ వేపు చూసి ''అవునండీ.... అతను... అదే మీ అబ్బాయి మరోసారి వచ్చినపుడు... రామానుజంగారి అమ్మాయి కనకరత్నాని చూసి... నచ్చిందంటేనూ... పెళ్ళి మాటలకు మిమ్మల్నీ తీసుకురమ్మని చెప్పారు కదా...! అందుకే మీరూ వచ్చారని అనుకుంటున్నాం...!'' అంది. అంతేకదా అని అడుగుతున్నట్లు రామానుజం వేపు చూసింది.

''అంతే...'' అన్నట్లుగా అతనూ తలవూపాడు.

''అది సరేగానీండి... మరి ఇక్కడకు మిమ్మల్ని వెంటబెట్టుకుని వచ్చేటపుడు ఎక్కడికి, ఏమిటీ... అని... ఏమీ చెప్పనేలేదా....?'' కామేశ్వరి ఆశ్చర్యంగా అడిగింది.

ఆవిడ షాక్ తగిలినదానిలా బిగుసుకుపోయి అందరివేపూ బిత్తర చూపులు చూసింది.

''ఏమిటో... మీరు పెళ్ళి అంటున్నారు.... మాటలంటున్నారు... మావాడికే...? విడ్డూరంగా

ఉంది! వాడు నాకు మాట మాత్రంగానైనా చెప్పకపోవటమేమిటో... ఏమి బోధపడలేదండీ! మీ అమ్మాయిని చూసి నచ్చిందని చెప్పాడా...?' రామానుజం వేపు ఆవిడ కళ్ళింత చేసుకుని చూసింది.

★ ★ ★